క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం

తంగడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో పురాతన దశావతార సహిత శ్రీలక్ష్మీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితులు, ఆలయ పూజారుల ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మండల నాయకులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయ్యవారి వెంకటాచార్యులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి జ్ఞానం వస్తుందని ఏకాగ్రతను పెంచుతుందన్నారు. పూజలను శేషాద్రి, వేణు, ఫణీంద్రలు నిర్వహించారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సమత నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, రాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం



ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్తయ్య

కొత్తూరు: మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ సత్తయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, సురేష్, సుధాకర్‌రెడ్డి, రవి, అశోక్, పద్మారావు, లింగంగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

ఆర్థికసాయం అందజేసిన బాల్య మిత్రులు



రమేశ్ కుటుంబానికి నగదు అందజేస్తున్న పదో తరగతి బ్యాచ్

షాబాద్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు పిట్టల రమేశ్ కుటుంబానికి అండగా ఉంటామని పదో తరగతి మిత్రులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని చెందిన రమేశ్ ఫిట్స్‌తో మృతి చెందాడు. అతని భార్య మంజులకు ఆదివారం రూ.43,500 నగదును అందజేశారు. గత డిసెంబర్ 25న అతడికి ఫిట్స్ రావడంతో కాలువలో పడి మరణించాడు. దీంతో అతడి పదో తరగతి బ్యాచ్ మిత్రులు కుటుంబాన్ని ఆదుకునేందుకు శ్రీకారం చుట్టారు. అందరూ కలిసి నగదును పోగు చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పదో తరగతి మిత్రులు ఇమ్రాన్, రాజేష్, క్రిష్ణగౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్, పిట్టల శ్రీను తదితరులున్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: రెడ్డి యువత అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి భవనంలో రెడ్డి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రెడ్డి యువత రాణించాలన్నారు. ప్రతి యువకుడు లక్ష్యాన్ని ఎంచుకొని నిరంతరం సాధన చేయాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే అసాధ్యం కానిది ఏదీ లేదన్నారు. రెడ్డి బంధువులందరూ సంఘటితంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అరుంధతి, దామోదర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, స్వరూప, శ్రీలత, అంకిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం

- హరితహారానికి సిద్ధమవుతున్న నర్సరీలు
- షాబాద్‌లో 4 లక్షలకు పైగా నాటేందుకు కసరత్తు
- ఇప్పటికే స్థల సేకరణ పూర్తి



సంకెపల్లిగూడ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

షాబాద్: పదో విడత హరితహారం కోసం ఇప్పటి నుంచే గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ ఏటా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం ముమ్మరంగా సాగుతోంది. ప్రతి సంవత్సరం నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. దాదాపు 4 లక్షల 51 వేల మొక్కలను పెంచేందుకు ప్రణాళిక రచించారు. మండలంలో నర్సరీల ఏర్పాటు కోసం అధికారులు ఇప్పటికే స్థల సేకరణను 100 శాతం పూర్తి చేశారు. ప్రస్తుతం ప్లాస్టిక్ బ్యాగులను సిద్ధం చేసి వాటిలో మట్టిని నింపి విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మొక్కలు జూన్ నాటికి అందుబాటులోకి వచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

నర్సరీలో 11 వేల మొక్కలు

గ్రామ పంచాయతీ నర్సరీలో 11వేల మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీకి ఇప్పటికే మొక్కలను పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగులను సైతం సరఫరా చేశారు. వీటిలో ఒండ్రు, నల్లమట్టి, ఎర్రమట్టి, పశువుల ఎరువును కలిపి ఉంచుతున్నారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టిని కూలీల సాయంతో నింపుతున్నారు. టేకు, ఉసిరి, జామ, సీతాఫలంతో పాటు వేప మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

పంచాయతీలదే బాధ్యత

ఉపాధిహామీ పథకం కింద నర్సరీలను పెంచి, వాటిని వర్షాకాలంలో నాటి సంరక్షించాలి. ఈ బాధ్యతను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. అలాగే ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు అందించి వాటిని జీపీ రికార్డుల్లో నమోదు చేయాలి. ప్రతి ఇంట మొక్కలు నాటేందుకు వీలుగా పూలు, పండ్లు, టేకు, వేప తదితర మొక్కలను అధికంగా పెంచనున్నారు. మొక్కల సంరక్షణలో గ్రామ పంచాయతీలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఉపాధి పొందుతున్న కూలీలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం కార్యక్రమం కోసం నర్సరీలలో చేపడుతున్న మొక్కల పెంపకంతో పలువురు కూలీలు ఉపాధి పొందుతున్నారు. నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనుల కోసం 15 నుంచి 20 మంది కూలీలు పని చేస్తున్నారు. కూలీకి ప్రతి రోజు రూ.265 వరకు ఉపాధి హామీ పథకం కింద డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేక పోవడంతో నర్సరీల్లో పని చేస్తూ కూలీలు ఉపాధి పొందుతున్నారు.

పనులు వేగవంతం చేశాం



మండల వ్యాప్తంగా మొక్కల పెంపకానికి 41 గ్రామ పంచాయతీలలో నర్సరీల పనులు ఇప్పటికే ప్రారంభించాం. మొక్కల పెంపకానికి మట్టిని తెప్పించి ప్లాస్టిక్ సంచులలో నింపే పనులు చేపడుతున్నాం. జూన్‌లో మొక్కల అందించాలని లక్ష్యంగా పెట్టుకొని పనులు వేగవంతం చేస్తున్నాం.

–వీరాసింగ్, ఉపాధిహామీ ఏపీఓ, షాబాద్

జూన్ వరకు పూర్తి చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలో 4 లక్షల 51వేల మొక్కలను పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. మండలంలోని 41 పంచాయతీలల్లో నర్సరీలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం బ్యాగుల్లో మట్టి నింపి, విత్తనాలు నాటే కార్యక్రమం పూర్తి కావొచ్చింది. జూన్ నెల నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తాం.

–అనురాధ, ఎంపీడీఓ, షాబాద్



బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తజనం

కనులపండువగా మల్లన్న కల్యాణం

ఘనంగా చిలుకూరు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు



శివసత్తుల పూనకాలు

మొయినాబాద్: వేదపండితులు మంత్రోశ్చరణలు.. మంగళ వాయిద్యాలతో చిలుకూరు సురకంటి భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. మండల పరిధిలోని చిలుకూరు సురకంటి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగెరి మల్లేష్ దంపతులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు దంపతులు కల్యాణోత్సవంలో కూర్చొని వారి చేతుల మీదుగా జరిపించారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మల్లన్న బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. శివసత్తుల పూనకాలు, డోలు తాశాల చప్పుల్ల మధ్య బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం శివసత్తులు అగ్నిగుండాలు తొక్కారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్, చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ తదితరులు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప ఆంద్రూ, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, నాయకులు శ్రీరాములు, మల్లారెడ్డి, నర్సింహాగౌడ్, రాజు, దశరథ్‌రెడ్డి, నరేందర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

జనవాడలో మహా పడిపూజ

శంకర్‌పల్లి: మండలంలోని జనవాడ గ్రామంలో అయ్యప్ప శరణు ఘోషలతో మార్మోగింది. ఆదివారం గ్రామ సర్పంచ్ లలితనర్సింహా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహాపడి పూజా కార్యక్రమం కేశవ గురుస్వామి నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాముల ఇరుముడి వైభవంగా జరిగింది. స్వాములు శబరిమల యాత్రకు బయలు దేరారు. భాస్కర్ చారి భజన మండలి పాడిన భక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

భక్తి మార్గంలో నడవాలి

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పూజలో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ప్రొద్దటూరు గ్రామంలో నిర్వహించిన మల్లన్న కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఆచారాలను మరువకూడదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వీజేఐటీలో విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగాలు చేస్తూ సమాజ సేవ కార్యక్రమాలలో పాలు పంచుకున్నప్పుడే గుర్తింపు వస్తుందని విద్యా జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబారెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని విద్యా జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 2023 సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన 400 మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, కళాశాల డీన్ పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీలత, అడ్మినిస్ట్రేట్ సీనియర్ అధికారి వెంకటచలం పాల్గొన్నారు.



షాబాద్: చర్లగూడలో శోభాయాత్ర నిర్వహిస్తున్న వినాయక సేవాసమితి సభ్యులు



షాద్‌నగర్‌రూరల్: అక్షితలతో వెళ్తున్న ఎలికట్ట గ్రామస్తులు

ఇంటింటికీ రాములోరి అక్షితలు

పాదయాత్ర చేపట్టిన రామభక్తులు

షాద్‌నగర్‌రూరల్: అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని గ్రామాలకు ఆదివారం అక్షితలను అందజేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణం నుంచి మండల పరిధిలోని ఎలికట్ట వరకు పాదయాత్ర చేపట్టిన రామభక్తులు అయోధ్య అక్షితలను గ్రామానికి తీసుకువెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, ఉపసర్పంచ్ మల్లేష్‌పూజారి, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య, నాయకులు సంజీవయాదవ్, కృష్ణయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో

చేవెళ్ల: మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో అయోధ్య నుంచి శ్రీరామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అక్షితలకు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మానిక్యరెడ్డితోపాటు గ్రామంలోని బీజేపీ నాయకులు, శ్రీరాముని భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. గ్రామ నాయకులు, సామ క్రిష్ణారెడ్డి, రమేశ్, బక్కయ్య, సత్యం, శ్రీనివాస్, రాజు, గ్రామ పెద్దలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముడిని స్ఫూర్తితో

మొయినాబాద్‌రూరల్: శ్రీరాముడిని స్ఫూర్తితో అందరూ ముందుకు నడవాలని సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో అయోధ్య రాముడి అక్షితలు భక్తులు, నాయకులు, పెద్దలు, గ్రామ సర్పంచ్‌తో కలిసి ఇంటింటికి పంచారు. శ్రీరాముడి అక్షితలు అందరు స్వీకరించి పూజించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శోభాయాత్ర

షాబాద్: ఇంటింటికీ రాములోరి అక్షితలు పంపిణీ చేస్తామని చర్లగూడ వినాయక సేవ సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడలో హనుమాన్ దేవాలయంలో శ్రీరాముడి అక్షితల శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో వినాయక సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.



ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గ్రామాలాభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో ఆదివారం సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో హెచ్‌ఎండీఏ, 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం, పాఠశాల భవనాలను ఎమెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయలేదన్నారు. దీంతో సర్పంచులు అనేక ఇబ్బందులు పడి సొంత ఖర్చులతో తమకు తోచిన విధంగా అభివృద్ధి చేశారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపేందుకు కృషి చేసిన సర్పంచులకు సరైన గుర్తింపు, ప్రోత్సాహం లేవన్నారు. ఎలాంటి ఆదాయం, వనరులు లేని గ్రామాల సర్పంచులు అప్పులు చేసి మరీ సిబ్బందికి వేతనాలు ఇచ్చిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పరిస్థితులను అధిగమించి ప్రతి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుంధర్‌రెడ్డి, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు వజ్రలింగం, వెంకటయ్య, బాల్‌రాజు, దేవేందర్, దయానంద్‌గుప్తా, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాల మేరకు బస్సులు

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చినప్పుడే అభివృద్ధి సాధించినట్లని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజినల్ మేనేజర్ శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. ఆర్టీసీపై ప్రజల్లో పూర్తి విశ్వాసాన్ని కల్పించి సంస్థ అందిస్తున్న సేవలను ప్రయాణికులకు వివరించాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలలో కాకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులను నడపాలని, ప్రయాణికులు కోరిన చోట బస్సును ఆపితే సంస్థకు లాభాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్, జంగయ్య, డిపో సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: కానుకలు అందజేస్తున్న భీంభరత్ తదితరులు

పథకాలు చేరువయ్యేలా కృషి

- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్
- మొయినాబాద్‌లో క్రైస్తవులకు కానుకల పంపిణీ

మొయినాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రిస్మస్‌కు ముందే గిఫ్టులు ఇవ్వాలనుకున్నామని.. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి గ్రామంలో అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు సైతం ప్రభుత్వ పథకాలను ప్రజలకందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, అధికార ప్రతినిధి గౌరి సతీశ్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చందారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేష్‌యాదవ్, వీరభద్రస్వామి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, వాసుదేవ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రాజు, జైపాల్‌రెడ్డి, రాములు, ఆంజనేయులుగౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేరిగూడలో ఎల్లమ్మ బోనాలు



శంకర్‌పల్లి: శేరిగూడలో ఎల్లమ్మ బోనాల ఉత్సవంలో భీంభరత్ తదితరులు

శంకర్‌పల్లి: మన సంస్కృతి సాంప్రదాయాలను మరవ కూడదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. ఆదివారం మండలంలోని శేరిగూడ గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన్ని గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల జాతర అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తిరుపతయ్య, మాణిక్యరెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీశైలం, రాంచందర్, కాశీనాథ్‌గౌడ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.